క్లుప్తంగా

ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధం



గోకులపాడులో రైతు భరోసా కేంద్రం



విలేజ్ హెల్త్ సెంటర్

కల్లూరు: మండల పరిధిలోని ఎ.గోకులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఆయా కార్యాలయాలను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా ప్రారంభిస్తారని పంచాయతీ రాజ్ ఏఈ అచ్యుతానందరెడ్డి తెలిపారు. అలాగే వక్కెర వాగుపై నిర్మించిన బ్రిడ్జిని కూడా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓలు జ్యోతి, ఏఓ మల్లేష్‌కుమార్, ఆదామ్‌బాషా, హౌసింగ్ ఏఈ సుమంత్, వీఆర్వోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఉన్నారు.

చింతమానుపల్లెలో మారెమ్మ దేవర



ఆలయం వద్ద ఫలహార బండ్లతో భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామ దేవత మారెమ్మ ఆలయంలో వసంతోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఎద్దుల బండ్లపై ఊరేగింపుగా ఫలహారాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు అమ్మవారి దేవర నిర్వహించనున్నట్లు గ్రామపెద్ద మహానంది తెలిపారు.

నేడు కబడ్డీ పోటీలు

చింతమానుపల్లెలో మారెమ్మ దేవరను పురస్కరించుకుని మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.20,016, రూ.13,016, రూ.7,016, రూ.5,016 అందిస్తామన్నారు. రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7989642367, 7981776581 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కంటి సమస్యలను సకాలంలో గుర్తించాలి



విద్యార్థిని కళ్లను పరిశీలిస్తున్న అధికారి

కల్లూరు: పుట్టుకతో వచ్చే లోపాలను పిల్లల తల్లిదండ్రులు సకాలంలో గుర్తించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి శైలేష్‌కుమార్ అన్నారు. సోమవారం పందిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లల కళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు పుట్టుకతో లేదా పెరిగే క్రమంలో కంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ముఖ్యంగా మెల్లకన్ను సమస్యను సకాలంలో గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా కంటి వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పిల్లల కంటి చూపు దెబ్బతిని అంధత్వం వచ్చే అవకాశం ఉందన్నారు.

ఇద్దరికి గాయాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని తాటిమాన్ కొత్తూరు వద్ద సోమవారం లారీ-కారుని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయపడ్డారు. అనంతపురం జిల్లాకు చెందిన సంతోష్, దేవలి గిద్దలూరుకు వెళ్తుండగా తాటిమాన్ కొత్తూరు వద్ద లారీ ఢీంది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో డోన్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.

సేవలకు సత్కారం

- సంక్షేమ పథకాల అమల్లో కీలక పాత్ర
- వారి సేవలకు గుర్తింపుగా అవార్డులను అందజేస్తున్న ప్రభుత్వం
- నేడు పాణ్యం నియోజకవర్గంలో వలంటీర్లకు వందనం
- ఐదుగురికి సేవావజ్ర, 20 మందికి రత్న 988 మందికి సేవామిత్ర
- ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



ఆస్పత్రిలో రోగి కుటుంబ సభ్యురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

గడివేముల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు చేరవేస్తూ నిరంతరం సేవ చేస్తున్న వలంటీర్లను వరుసగా నాలుగో ఏడాది సత్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాణ్యం నియోజకవర్గంలో పనిచేస్తున్న వలంటీర్లను మంగళవారం సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల వద్దకే అందించేందుకు గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థను ప్రారంభించింది. ఈ వ్యవస్థ ద్వారా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. వలంటీర్లు తమ పరిధిలో నిస్వార్థంగా పనిచేస్తూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారు. అన్నివేళలా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తోంది. ప్రతి ఏడాది పురస్కారాలతో సత్కరిస్తూ వలంటీర్లలో నూతన ఉత్సాహం నింపుతోంది. పాణ్యం నియోజకవర్గ స్థాయిలో ఐదుగురికి సేవావజ్ర, 20 మందికి సేవా రత్న, 988 మందికి సేవా రత్న పురస్కారాలు అందించనున్నారు.

కష్టపడే వారికి గుర్తింపు



కష్టపడే వారికి ఎప్పుడైనా తగిన గుర్తింపు ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకు చేర్చడం, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని కేటాయించిన కుటుంబాలకు తెలియజేసి, అర్హులు ఉంటే అప్లికేషన్లు తీసుకుని మంజూరు చేయించడంతో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. పింఛన్లు సకాలంలో పంపిణీ చేసి ప్రజలకు నిత్యం అందుబాటులో సేవలు చేసిన వారిని రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా అవార్డులకు ఎంపిక చేసింది. వారు చేసిన కష్టానికి తగిన గుర్తింపునివ్వడం వారిలో ఉత్తేజం నింపుతుంది.

–శివరామిరెడ్డి, ఎంపీడీఓ, గడివేముల

సేవలకు గుర్తింపు

గడివేముల మండలంలో 14 సచివాలయాల పరిధిలో 196 మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 189 మందికి సేవామిత్ర, ఐదుగురు సేవారత్న, ఇద్దరు సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. బూజునూరు గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న కొల్లం జయపాల్, చిందుకూరు సచివాలయంలో పనిచేస్తున్న బానాల శ్రీకాంత్ సేవావజ్ర అవార్డులకు ఎంపికయ్యారు. బిలకలగూడూరు సచివాలయానికి చెందిన ఆవుల స్వప్న, బూజునూరు బాలమనోహర్, దుర్వేశి భారతి, కొరటమద్ది సురేష్, పెసరవాయి మంజుల సురేష్‌బాబు సేవా రత్న అవార్డులు అందుకోనున్నారు. వీరితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందించనున్నారు.

ప్రజా సేవ సంతృప్తినిస్తోంది



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సకాలంలో చేరవేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిస్తోంది. నా పరిధిలోని అర్హులందరికీ అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక వంటి పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేస్తున్నాను. డబ్బు సంపాదించడం కన్నా సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి లభిస్తోంది.

–బానాల శ్రీకాంత్, సేవావజ్ర, చిందుకూరు సచివాలయం

సంతోషంగా ఉంది



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు సేవలందించడం సంతోషంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున పింఛన్ ఇచ్చేందుకు వెళ్లినప్పుడు లబ్ధిదారుల సంతోషం చూసి చెప్పలేని సంతృప్తి కలిగేది. మా కష్టాన్ని గుర్తించి అవార్డుతో ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

–జయపాల్, సేవావజ్ర, బూజునూరు సచివాలయం

నేడు కొత్తకోటలో వైద్య శిబిరం

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తకోట గ్రామంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. వివిధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. గ్రామంలోని సచివాలయ ఆవరణలో జరిగే ఈ శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

గూడూరు: వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక వైఎస్సార్ కార్యాలయంలో వలంటీర్లను సన్మానించనున్నట్లు ఎంపీడీఓ కుమారి జయశ్రీ తెలిపారు. రూరల్ పరిధిలోని వలంటీర్లు తప్పక హాజరుకావాలన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్

గూడూరు: పట్టణంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఈ కేంద్రాల్లో ప్రజలు కొత్తగా ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు



డీటీకి అర్జీ ఇస్తున్న బాధితులు

సి.బెళగల్: తమ స్థలాన్ని అక్రమంగా బదలాయించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు, ప్రజా సంఘాల నాయకులు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తిని కోరారు. సి.బెళగల్‌కు చెందిన ఉషాహెబ్సిబా, స్వర్ణలత వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్‌లో 557/1లో తాము నివాసమున్న స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గ్రామానికి చెందిన బీరకాయల చిన్నమునెప్ప తన కుమారుడు బీరకాయల రాయాంజనేయులు పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారులకు, గ్రామ పెద్దలకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ డీటీకి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదుపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దు



హంద్రీ కాలువను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్‌తో కలిసి కోడుమూరు, ముడుమలగుర్తి గ్రామాల మధ్య ఉన్న హంద్రీ కాలువను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల హంద్రీలో తగినంత నీటి నిల్వలు లేనందున ఆయా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుతోందని, నీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే రెండుసార్లు జీడీపీ నీటిని హంద్రీనదికి విడుదల చేయించామని తెలిపారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అధికారులు ఆయా గ్రామాల్లో పనిచేయని బోర్లు, ట్యాంకులను బాగుచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఏఈ ప్రసాద్‌కు సూచించారు. సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సుబ్రమణ్యేశ్వరుడి ఆదాయం రూ. 14.80 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో టెంకాయల వేలం ద్వారా రూ.14.80 లక్షలు వచ్చాయని ఈఓ రామక్రిష్ణ సోమవారం తెలిపారు. ఏడాది పాటు ఆలయ ప్రాంగణంలో టెంకాయలు విక్రయించేందుకు వేలంపాట నిర్వహించామన్నారు. ఐదుగురు పాటదారులు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అందరికన్నా ఎక్కువగా రూ. 14.80 లక్షలకు పాడి దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది అదనంగా రూ. 40వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గడివేముల ఈఓ మోహన్, క్రిష్ణారెడ్డి, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



సూచనలు చేస్తున్న సీఐ, ఎస్‌ఐ

కోడుమూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ బాలనరసింహులు అన్నారు. సోమవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో నాకాబంది నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇండ్లలో తనిఖీలు చేశారు. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అనవసరమైన గొడవలకు జోలికి వెళ్లినా, దాడులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు



గడివేముల జెడ్పీ స్కూల్‌లో టీషర్టులను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

గడివేముల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పనులతో కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో తీర్చిదిద్దారని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం గడివేముల జెడ్పీ పాఠశాల ఆవరణలో సొంత నిధులతో క్రీడాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంతో పల్లెల్లో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వచ్చిందని తెలిపారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో తమ మండల క్రీడాకారులు సత్తాచాటారన్నారు. బడులకు కావాల్సిన క్రీడా మెటీరియల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియల్, ఫిజికల్ డైరెక్టర్ భుజంగరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆర్‌బి నంజీవరెడ్డి, ఉపాధ్యాయుడు రాముడు, మాజీ స్కూల్ చైర్మన్ నబిరసూల్, మూలపెద్దమ్మ దేవాలయం మాజీ చైర్మన్ తలారి చిన్నన్న, శ్రీనివాసులు, కేశవరావు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో అధికారుల వివరాలు



పాణ్యం 273 పోలింగ్ బూత్ వద్ద అధికారుల వివరాలు

పాణ్యం: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పాణ్యం నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల వద్ద అధికారుల పేర్లు, పోలింగ్‌బూత్ నంబర్, అసెంబ్లీ నంబర్, తహసీల్దార్, ఎస్‌ఐ, సెక్టోరల్ అధికారుల పేర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. కర్నూల్ జేసీ, పాణ్యం నియోజకవర్గ ఆర్‌ఓ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో ఇలాంటి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పాణ్యం నియోజకవర్గంలో 340 బూత్‌లు ఉన్నాయి. త్వరలో మరోమారు బూత్‌లను పరిశీలించేందుకు ఆర్‌ఓ రానున్నారు. కేంద్రాల వద్ద ర్యాంపులు, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

చెన్నకేశవస్వామి రాజగోపుర పనులకు శంకుస్థాపన





శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, రాజగోపురానికి భూమి పూజ

- రాజగోపురానికి సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు మంజూరు
- పురాతన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు తోడ్పడాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చెన్నకేశవస్వామి ఆలయంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న మూడు అంతస్తుల రాజగోపురానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ ముఖ్య ద్వారంలో నిర్మిస్తున్న రాజగోపురానికి సీజీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో దాతల సహకారం అభినందనీయమన్నారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్రామ నడిబొడ్డులో నిరుపయోగంగా ఉన్న పురాతన భవన యజమానులు సహకరిస్తే దాని స్థానంలో ప్రజలకు ఉపయోగపడే ఫంక్షన్ హాల్ నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పారిశ్రామిక ప్రభావిత, ప్రభావేతర ప్రాంతాలకు రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైతే కలెక్టర్‌తో మాట్లాడి ఈ నిధులతో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. జైరాజ్ ఇస్పాత్‌కు పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని గ్రామ ప్రజల సౌలభ్యం కోసం ఉపయోగపడేలా చూడాలని నాగలింగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కంపెనీ యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. అంతరం రాజగోపుర నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలను ఎమ్మెల్యే కాటసాని సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, ఈఓ మద్దిలేటి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సర్పంచ్ నాగేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ పెద్దయ్య, సింగిల్ విండో చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు, నాయకులు శంకర్‌రెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.242 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.


స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

గూడూరు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని ఎంపీడీఓ కుమారి జయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ శారద అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. వినతులను విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, వైఎస్సార్ ఏపీఎం చక్రధర్, ఎంఈఓ సునీలమ్మ పాల్గొన్నారు.

27న కూరగాయల మార్కెట్‌కు వేలం

గూడూరు: నగర పంచాయతీలో వివిధ హక్కుల కోసం ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24–25 ఆర్థిక సంవత్సరానికి దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, గొర్రెల మాంసం మార్కెట్, గొర్రెల కమేళ, పెద్ద పశువుల మాంసం, పెద్ద పశువుల కమేళకు సంబంధించి వేలాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలం పాల్గొనదలచిన వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆలయానికి లాకర్ బహూకరణ



ఆలయంలో దాత కుటుంబ సభ్యులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులాపరమేశ్వరీదేవి ఆలయానికి నంద్యాలకు చెందిన ఈశ్వర్ సోమవారం రూ. 1.40 లక్షల విలువైన లాకర్‌ను విరాళంగా అందజేశారు. ఆలయ ఉద్యోగి కేశవ్, పూజారి చిన్న దాత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదేళ్ల జైలు శిక్ష

జనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన గోవర్ధన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3,500 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. పలుకూరు గ్రామానికి చెందిన వివాహితపై భర్త లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి, కోరిక తీర్చమని బలవంతం చేశాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో వైర్‌తో గొంతు బిగించి హత్య చేసేందుకు యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నందివర్గం పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నంద్యాల 2వ అదనపు జిల్లా జడ్జి విచారించి.. నేరం నిజమని తేలడంతో నిందితుడికి జైలు, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేత్రపర్వం.. వెంకటేశ్వరుని కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పురోహితులు



హాజరైన మహిళా భక్తులు

ఓర్వకల్లు: మండలంలోని శకునాల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. లక్ష్య సాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 21వ తేదీ ప్రారంభమైన 'గడప గడపకు గోవు, గోవిందుడు గీత' పేరుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన జనజాగారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని శకునాల గ్రామానికి చేరుకుంది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పురసంకీర్తనల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నయనానందకరంగా నిర్వహించారు. ఈ సంకల్పానికి తోడుగా, వందలాది మంది భక్తులు పాల్గొని భక్తి ఉద్యమానికి తోడుగా నిలిచారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి భజన కమిటీ భజనగీతాలతో భక్తులను చైతన్య పరిచారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సంస్థ ప్రతినిధి గట్టు అరుంధతి రంగాచార్య మాట్లాడుతూ.. సనాతన భారతీయ వైదిక ధర్మాల్లో గోవు, గోవిందుడు, గీతకు ఎంతో ప్రాధ్యాతన ఉందని తెలిపారు. అనంతరం భక్తులకు భగవద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



హోమ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



దేవతామూర్తులను తీసుకెళ్తున్న గ్రామస్తులు

సి.బెళగల్: మండలంలోని పల్‌దొడ్డి గ్రామంలో సోమవారం నూతన ఆలయ ప్రారంభం, దేవతా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శ్రీవీర లింగేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సంతో పాటు శ్రీగణపతి, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. అదేవిధంగా గ్రామ శివారులోని తుంగభద్ర నదితీరంలో గ్రామదేవత శ్రీజమ్ములంబ దేవి విగ్రహం, ఆలయంపై కలశ ప్రతిష్టను వేడుకగా నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.